ప్రజాశక్తి

మంగళవారం 21 నవంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా





పసి పిల్లల ప్రాణాలతో చెలగాటం

● కాలం చెల్లిన, నాసిరకం తినుబండారాల విక్రయం

● వన్‌టౌన్లో లక్షల్లో వ్యాపారం ● రక్తహీనత, జీర్ణకోశ వ్యాధుల ప్రభావం



ప్రజాశక్తి : వన్‌టౌన్ : విజయవాడలో నాసిరకం తినుబండారాలు రాజ్యమేలుతున్నాయి. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌లో కాలం చెల్లిన ప్యాకెట్లను తక్కువ ధరకు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి చిల్లర దుకాణాల్లో విక్రయిస్తున్నారు. దీంతోపాటు అసలు ఏ మాత్రమూ క్వాలిటీ లేని, పూర్తి అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేసిన చిరుతిళ్ల ప్యాకెట్లను విచ్చలవిడిగా విక్రయించేస్తున్నారు. విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలో ఇలాంటి వ్యాపారం ప్రతిరోజూ లక్షల్లో సాగుతోందంటే ఆశ్చర్యం వేయకమానదు. వీటి ప్రభావంతో ఇటీవల కాలంలో చిన్న పిల్లలు ఎక్కువగా జీర్ణకోశ సంబంధ, చర్మ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. పిల్లలను పరిక్షించిన స్థానిక ఆర్ఎంపి వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు తినే చిప్స్, బిస్కెట్ ప్యాకెట్లు, చాకెట్లలో క్వాలిటీ ఉండటం లేదని, కొన్ని సందర్భాల్లో వాంతులు విరేచనాల బారినపడుతున్నారని, ఏమి తిన్నారని అడిగితే ఎక్కువమంది తల్లిదండ్రులు చిప్స్ తిన్నారని సమాధానం చెబుతున్నారని పేర్కొంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పిల్లల జీర్ణవ్యవస్థపై ప్రభావం పడుతుందని, ఇది వారి ఎదుగుదలతోపాటు, మానసిక ఇబ్బందులకు గురిచేస్తుందని పేర్కొంటున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన ఆహార తనిఖీ అధికారులుగానీ, కార్పొరేషన్ సిబ్బందిగానీ అటు వైపు దృష్టి సారించడం లేదు. ఇటీవల కాలంలో చిన్న పిల్లల్లో ఎక్కువగా ఇన్ఫెక్షన్స్ వస్తున్నాయని, ఇది కూడా చిప్స్, కాలం చెల్లిన బిస్కెట్ ప్యాకెట్ల వల్లేనని చెబుతున్నారు. నగరంలో గోడౌన్లలో, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌లో కాలం చెల్లిన ప్యాకెట్లను వేలం వేస్తుంటారు. వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరంలో కొద్దిమంది వ్యాపారులు అతి తక్కువ ధరకు చిల్లర దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. తక్కువ ధరకు వస్తుండటంతో వ్యాపారులు కూడా విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు. అలాగే స్థానికంగా ఏ మాత్రమూ శుభ్రత లేకుండా తయారు చేస్తున్న చిప్స్‌ను ఆకర్షణీయమైన పేర్లతో మార్కెట్లో వదిలేస్తున్నారు. వాటికి ఎవరు లైసెన్స్ ఇచ్చారనే విషయాలేవీ (మిగతా 6లో)

దాళ్వా వరికి నీరు లేదు !

- మూడో ఏడాదిలోనూ రైతులకు నిరాశ
- అరకొరగానే రాయితీపై మినుము విత్తనాలు !
- రబీలో 3.28 లక్షల ఎకరాల్లో ఇతర పంటలకు ప్రణాళిక



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రకాశం బ్యారేజి ఎగువన కృష్ణానది ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో ఈ ఏడాది కృష్ణా డెల్టాలో దాళ్వా వరిసాగుకు ప్రభుత్వం అవకావం ఇవ్వడంలేదు. ఈ నేపథ్యంలో 2023-24 రబీ సీజన్లో ఇతర పంటల సాగుకు వ్యవసాయశాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఖరీఫ్ సీజన్లో కృష్ణాజిల్లాలో 3 లక్షల 57 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఖరీఫ్ వరి కోతలు కూడా ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో రెండో పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న క్రమంలో దాళ్వా వరిసాగుకు నీరివ్వలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో వరుసగా మూడో ఏడాదీ దాళ్వా వరిసాగుకు అవకాశం లేకుండా పోయింది. గత రెండేళ్లుగా ప్రాజెక్టుల్లో నీరున్నా వివిధ కారణాలతో దాళ్వాకు నీరివ్వలేదు. గతేడాది ముందస్తుగా కాల్వలు, డ్రెయిన్లకు మరమ్మతులు చేస్తామనే కారణాన్ని చూపి సాగునీరు విడుదల చేయలేదు. కానీ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో వరుసగా మూడేళ్లపాటు సముద్రతీర ప్రాంతంలోని అపరాలు పండని చౌడు భూముల్లో రెండో పంట వేసుకునే అవకాశం లేకుండాపోయింది. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను, బంటుమిల్లి తదితర మండలాల్లో 60 వేల ఎకరాల్లో రైతులు ఒక పంటతోనే మూడేళ్లుగా సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

రబీ సీజన్ ప్రణాళిక ఇలా

రబీకి నీరివ్వలేమని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కృష్ణాజిల్లాలో 2 లక్షల 84 వేల 970 ఎకకరాల్లో మినుము, 9,912 ఎకకరాల్లో పెసర, 2,478 ఎకరాల్లో వేరుశనగ, 16,107 ఎకరాల్లో మొక్కజొన్న, 4,956 ఎకరాల్లో జొన్నతోపాటు కంకిపాడు, పెనమలూరు ప్రాంతాల్లో విద్యుత్ బోరు మోటార్ల కింద మరో 9,912 ఎకరాల్లో దాళ్వా వరి సాగవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

రాయితీ విత్తనాలకు డి కృషియాప్

జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న మినుము సాగుకు అరకొరగానే రాయితీ విత్తనాలు అందనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 23 వేల క్వింటాళ్ల మినుము విత్తనాలు అవసరం ఉంటుంది. ఎల్‌బిజి 752, 787, టిబిజి 104 రకాల విత్తనాలను రైతులు సాగు చేస్తారు. ప్రభుత్వం మాత్రం 5,400 క్వింటాళ్ల ఎల్‌బిజి 752 రకం విత్తనాలను మాత్రమే రైతులకు అందుబాటులో ఉంచింది. రాయితీ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ తదితరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎకరాకు 20 కిలోల మినుములను రాయితీగా ఇస్తారు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకు మాత్రమే రాయితీ విత్తనాలు అందిస్తారు. క్వింటా విత్తనాలు రూ.17,940 కాగా, 30 శాతం రాయితీపై రూ.13,800కు రైతులకు ఇస్తారు.

ఆర్‌బికెల ద్వారానే రాయితీ విత్తనాలు ఇవ్వాలి

గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కృష్ణాజిల్లా

కృషి యాప్‌లో విత్తనాలు కోసం నమోదు చేసుకునే అవగాహన చాలా మంది రైతులకు లేదు. కొద్ది మందికే అవకాశం ఉంటుంది. అవసరమైన రైతులకు ఆర్‌బికెల ద్వారా రాయితీ విత్తనాలు అందించాలి.

గన్నవరం...గరంగరం

● టిడిపిలో పట్టుకు యార్లగడ్డ ప్రయత్నం !

● సిట్టింగ్ ఎంఎల్ఎ వంశీ వ్యూహాత్మక మౌనం !!





ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరంలో టిడిపి తరపున ఎంఎల్ఎగా గెలిచి అధికార వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్న వల్లభనేని వంశీని ఎదుర్కొనేందుకు పార్టీ మారిన యార్లగడ్డ వెంకట్రావు ఆ ప్రాంతంలో తన బల ప్రదర్శనకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల వరకు వైసిపిలోనే ఉండి వంశీపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన...ఆ తర్వాత టిడిపిలో చేరి తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. నాలుగ్గోడల మధ్యే నడిచిన అంతర్గత పోరు ఇప్పుడు రెండు పార్టీల తరపున ఒకరికొకరు సవాల్ చేసుకునే వరకూ వెళ్లింది. పార్టీ మారిన సిట్టింగ్ ఎంఎల్ఎకు తన బలమెంతో ప్రదర్శించే స్థితికి వెళ్లిన యార్లగడ్డ...ఎంఎల్ఎతోపాటు అధికార పార్టీ అధిష్టానంపైనే విమర్శలకు సైతం దిగి ఇటీవలనే మరో పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో పాత ప్రత్యర్థులే కొత్త జెండాలతో పోటీపడబోతున్నారు ! ఉమ్మడి ప్రత్యర్థిని దెబ్బతీసేందుకు శత్రువుకు శత్రువు మిత్రుడన్నట్లుగా ఉంది గన్నవరంలో పరిస్థితి. వైసిపిలో ఉన్నప్పుడు యార్లగడ్డ అసమ్మతి నేతగా ఉండిపోయారు. తన అనుచరవర్గాన్ని కూడగట్టి ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించి వైసిపి అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకే సిద్ధపడ్డారు. అయితే ఆ పార్టీ అధిష్టానం వంశీకి గన్నవరం సీటు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో వ్యూహాత్మకంగా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. అనంతరం ఎంఎల్ఎ వంశీపై నేరుగా విమర్శలకు దిగారు. ఈసారీ తానే ఎంఎల్ఎ అవుతాననే ధీమాతో ఉన్న వంశీకి బహిరంగంగానే సవాల్ విసురుతున్నారు. ఆరునూరైనా నూరుఆరైనా టిడిపి తరపున గన్నవరం నుంచి బరిలో నిలిచి విజయం సాధిస్తానని చెబుతున్నారు. టిడిపిలో చేరక ముందు వంశీ వ్యతిరేకులు, వైసిపిలోని అసమ్మతి నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన యార్లగడ్డ... అప్పుడే తన బలాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. వంశీ కంటే వైసిపిలో తనకే ఎక్కువ కేడర్ ఉందని చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఎంఎల్ఎపై మాటలతో విరుచుకుపడుతూ వైసిపి అధినాయకత్వం తీరునూ ఎండగడుతున్నారు. వైసిపిలో కష్టపడే కార్యకర్తలకు, నిజాయితీగా ఉన్న నేతలకు అన్యాయం జరుగుతోందని విమర్శలకు దిగారు. వైసిపిలో మొదటి నుండీ ఉన్న సీనియర్ నేత దుట్టా రామచంద్రరావుకు పార్టీ అధిష్టానం ఎంఎల్సి పదవి కూడా ఇవ్వలేకపోయిందని ఆరోపించి...దుట్టా మద్దతు తనకేనని చెప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. టిడిపిలో తన పట్టును పెంచుకోవడానికి గ్రామ గ్రామాన తిరుగుతున్నారు. అంతర్గతంగా వైసిపి అసమ్మతి నేతలను రాత్రి సమయాల్లో కలుసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గన్నవరం వైసిపిలో రోజు రోజుకూ పెరుగుతున్న అసమ్మతిని ఆ పార్టీ అధిష్టానం, ఎంఎల్ఎ వంశీ ఎలా చల్లారుస్తారోనన్న చర్చ జరుగుతోంది. ఇక్కడ వైసిపి అభ్యర్థులుగా 2014లో దుట్టా రామచంద్రరావు, 2019లో యార్లగడ్డ వెంకట్రావు పోటీచేశారు. టిడిపి తరపున పోటీ చేసిన వల్లభనేని వంశీ రెండు సార్లూ విజయం సాధించారు. 2019లో యార్లగడ్డ తక్కువ ఓట్ల తేడాతోనే ఓటమిపాలయ్యారు. టిడిపి తరపున గెలిచిన వంశీ వైసిపి గూటికి చేరారు. ఈ నేపథ్యంలో అప్పట్లో యార్లగడ్డకు మద్దతుగా నిలిచిన తమకు పార్టీలో ప్రాధాన్యత తగ్గిపోయిందంటూ కొందరు వైసిపి నేతలు తీవ్ర అసంతప్తితో ఉన్నారు. టిడిపికి ప్రధాన టార్గెట్లుగా ఉన్నవారిలో వంశీ కూడా ఉండటంతో గన్నవరం వైసిపిలోని అసమ్మతిని టిడిపి తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. అయితే గన్నవరంలో హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలతో ఉన్న వంశీ.... అంతర్గతంగా తన ప్రణాళికను అమలు పరుస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆ ప్రణాళిక ప్రకారమే పావులు కదుపుతున్నారని అంటున్నారు.

కుల గణనకు చట్టబద్ధత కల్పించాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి లక్ష్మణరావు సూచన

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన నిర్వహణపై నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం ఆరు జిల్లాల ప్రాంతీయ స్థాయి సదస్సు జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగో పాల్ కష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కులగణనం ఉద్దేశాన్ని ఆయన వివరించారు. ఈ సదస్సుకు పలువురు ఎంపిలు, ఆరు జిల్లాలకు చెందిన పలువురు ఎంఎల్ఎలు, ఎంఎల్సిలు, ప్రభుత్వాధికారులు, కెవిపిఎస్‌తోపాటు పలు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, కుల సంఘాల నేతలు హాజరయ్యారు. సదస్సులో మొట్టమొదటగా అన్ని రంగాల్లో అనుభవం కలిగిన పిడిఎఫ్ ఎస్ఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావుకు మంత్రి మాట్లాడే అవకాశం ఇచ్చారు. కులగణన విజయవంతం అయ్యేవిధంగా సూచనలు చేయాలని కోరారు. దీంతో లక్ష్మణరావు ఆరు సూచనలు చేశారు. కులగణనకు చట్టబద్ధత కల్పించాలని, సర్వేల్లో వాలంటీర్లను మినహాయించి, సచివాలయ, రెవెన్యూ ప్రభుత్వ సిబ్బందిని ఉపయోగించాలని, ప్రభుత్వ ఉద్యోగుల్లో కులగణనకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిలో, అన్ని రకాల ఉద్యోగులకు ఒక రోజు సెలవు ప్రకటించాలని సూచించారు. గ్రామాల నుంచి ఉపాధి వెతుక్కుంటూ పక్క జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు వలస వెళ్లిన ప్రజలను పిలిపించి వారి వివరాలు సేకరించాలని, కుల కార్పొరేషన్ల చైర్మన్లు, కులసంఘాల నాయకుల సహకారం తీసుకోవాలని, మత ప్రస్తావన లేకుండా చూడాలని, ఆధార్‌తో లింక్ చేయని వ్యక్తుల కులగణన జరపటం సాధ్యం కాదని చేసిన ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర నేత జి.నటరాజు

మాస్టిన్లను ప్రత్యేకంగా గుర్తించాలి

కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజు

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజు మాట్లాడుతూ కులగణన సర్వేల్లో కళాశాల, ప్రాథమిక, ఉన్నత (మిగతా 6లో)

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఇది ప్రజల ప్రభుత్వం! ప్రజా సంక్షేమమే ఈ ప్రభుత్వ లక్ష్యమని, అభివద్ధి పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో చేస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. రెడ్డిగూడెం మండలంలోని నాగులూరులో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. తొలుత నాగులూరు గ్రామంలో వివి రోడ్డు నుంచి సాయన్నపాలెం వరకు రూ.2.96 కోట్ల వ్యయంతో నిర్మించిన బిటి, సిమెంట్ రహదారి ప్రారంభించారు. అనంతరం శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల పునరుద్ధరణకు రూ.4,325 కోట్లే ఖర్చుచేస్తే వైసిపి ప్రభుత్వం రోడ్ల పునరుద్ధరణ కోసం రూ.7,340 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. రహదారుల అభివద్ధి సిఎం జగనన్న ప్రభుత్వంలో ఎక్కువ నిధులు ఖర్చు చేశారని పేర్కొన్నారు.

బాలల హక్కుల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా తిరువూరు ఐడియాస్ సేవాసంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన బాలల హక్కుల వాల్‌పోస్టర్లను పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ సతీష్ కానిస్టేబుల్స్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐడిఎస్ డైరెక్టర్ శౌరీ, స్టేషన్ సిబ్బంది, రైటర్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు మురళీ కష్ణ, శిరీష, ఐడియాస్ సిబ్బంది రవిబాబు తదతరులు పాల్గొన్నారు.

ఎపి ఇఎపై అవగాహన సదస్సు



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్ ఎకనామిక్ అసోసియేషన్ (ఏపీ ఈఏ) ఆధ్వర్యంలో ఆర్థిక వద్ధి, సామాజిక రంగ అనే అంశంపై ఒకరోజు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎల్‌కె మోహన్‌రావు మాట్లాడుతూ నూతన విద్యా విధానం సమగ్ర అభివద్ధి జరగటంతో ప్రత్యేకంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే విధంగా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లీలా మోహన్, కళాశాల ప్రిన్సిపల్ ఈల్లా రవి, అసోసియేషన్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు, ప్రొఫెసర్ కే అప్పారావు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - మైలవరం : కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో మైలవరంలోని శివాలయానికి యాత్రికులు పోటెత్తారు. తెల్లవారుజామున 5 గంటలకే మహిళలు ఆలయానికి చేరుకొని దీపాలను వెలిగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పెద్ద ప్రసాదాలు స్వీకరించారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఫిర్యాదు


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం ముసాయిదా ఓటర్ల జాబితాలో అనేక తప్పులు పొరపాట్లు ఉన్నాయని వీటన్నిటిని తొలగించి ఖచ్చితమైన తుది ఓటర్ల జాబితా విడుదల చేయాలని ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితిసింగ్‌కి ఆధారాలతో సహా జనసేన పశ్చిమ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అదితిసింగ్ సూచనల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి డివి.నాగేశ్వరావుని కలిశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితా పూర్తిగా భవానీపురం ఎమ్మార్వో పరిధిలో ఉంటుందని, తప్పక ఈ విషయాన్ని పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పశ్చిమ నాయకులు పొట్నూరి శ్రీనివాసరావు, కొరగంజి వెంకట రమణ, మల్లెపు విజయలక్ష్మి, తిరుపతి అనూష, బొమ్ము రాంబాబు, రాము గుప్తా, దాసిన జై కృష్ణ, శ్రీనివాస్, ఎన్.పవన్ కళ్యాణ్, సోమీ మహేష్ తదితరులు పాల్గొన్నారు. స్పందనలో సబ్ కలెక్టర్ మొత్తం 122 అర్జీలను స్వీకరించారు.

అంగన్వాడీల సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - తిరువూరు : డిసెంబర్ 8వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా చేయనున్న నిరవధిక సమ్మె నోటీసును అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అంగన్వాడీ కార్యకర్తలు తిరువూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అసిస్టెంట్ సిడిపిఓ ఝూన్సీకి సోమవారం అందజేశారు. అనంతరం ప్రాజెక్ట్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేశారు. అంగన్వాడీలకు ముఖ్యమంత్రిగా హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనం పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం సిడిఎస్ బడ్జెట్ పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ఎఫ్ఆర్ ఎస్ యాప్ రద్దుచేసి అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, అయాల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచి, రాజకీయ జోక్యం అరికట్టాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలను, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తిరువూరు, ఏ.కొండూరు మండలాల కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మావతి, నల్లగట్ల నాగమణి, నాయకులు, పద్మ, సుశీల, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, వెంకటేశ్వరరావు, కుమారి, చిట్టెమ్మ, ఉషా అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - విజయవాడ : వైయస్సార్ కాలనీ (జక్కంపూడి)లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు బకాయి పడిన వేతనాలను సత్వరమే చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్‌ను కోరారు. కార్మికుల వేతనాలను మంజూరు చేయాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో నగర కమిషనర్‌కు కార్మికులతో కలిసి సత్యబాబు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ జక్కంపూడి కాలనీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సెప్టెంబర్, అక్టోబర్ వేతనాలు చెల్లించకపోవడం వలన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికుల వేతన బకాయిలతో పాటు, వారి వేతనాల నుండి మినహాయిస్తున్న ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు కార్మికుల అకౌంట్ నకు జమ కావడం లేదని అన్నారు. సదరు కాంట్రాక్టర్ ద్వారా బిల్లులు చెల్లించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ ప్రతినెల వేతనాలు చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. పారిశుధ్య కార్మికులంతా మూడు రోజుల నుండి పని బందు చేసి వేతన బకాయిలు రాబట్టుకోవడం కోసం ప్రతి నెల ఆందోళన చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ...కార్మికుల వేతనాలు త్వరగా చెల్లించేటట్లు చేయడంతో పాటు సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిపై తగు చర్యలు చేపడతానని హామీనిచ్చారు.


కార్మికులతో స్పందనకు వచ్చిన బోయి సత్యబాబు

చంద్రబాబుకు బెయిల్ పట్ల హర్షం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడంపై తెలుగుదేశం వాణిజ్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు రాజు సోలంకి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసిపిని ఓడించి చంద్రబాబుని సిఎం చేసేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని రాజు సోలంకి పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గం వన్‌టౌన్‌లోని బుద్ధ వెంకన్న కార్యాలయంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టపాసులు పేల్చారు. **కంచికచర్ల :** స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నాయకులు పార్టీ జెండాలతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. **గంపలగూడెం:** తోట మూల విగ్రహాల సెంటర్లో భాండాసంచా కాల్చారు. ఈ సందర్భంగా టిడిపి తిరువూరు ఇంచార్జ్ చేవల దేవ దత్తు, సీనియర్ నాయకులు మాట్లాడారు.


వన్‌టౌన్‌లో కేక్ తినిపించుకుంటున్న టిడిపి నాయకులు

తిరువూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కు హై కోర్టు బెయిల్ మంజూరు చేయటం పట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లో బాణా సంచా కాల్చి, స్వీట్స్ పంచి సంబరాలు చేసుకున్నారు. **మైలవరం :** ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఏ వెలంపల్లి

ప్రజలకు మేలు చేసింది జగనే : వెలంపల్లి

ప్రజాశక్తి - భవానీపురం : ప్రజలకు మేలు చేసింది సీఎం జగనన్నేనని, మళ్లీ జగనే రావాలని ప్రజలు కోరుతున్నారని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పశ్చిమ నియోజకవర్గంలో 35,37,39 డివిజన్లలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాల్లో వెలంపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఈ నాలుగేళ్లలో చేసిన మంచిని తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ బలసాని మన్నెమ్మ,37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అత్యాధునిక సదుపాయాలతో అపర్ణ గ్రీన్ స్కేప్ ప్రాజెక్టు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అపర్ణ గ్రీన్ స్కేప్స్‌ను ప్రారంభించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్.రెడ్డి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొంపల్లి వద్ద అల్ట్రా లగ్జరీ రెసిడెన్షియల్ గేటెడ్‌కమ్యూనిటీ ప్రాజెక్టుగా అపర్ణ గ్రీన్ స్కేప్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 13 ఎకరాల విస్తీర్ణంలో 768 ప్రీమి యం అపార్టుమెంట్‌లు, 3, 4 ,5 బిహెచ్‌కె విశాలమైన లేఅవుట్‌తో ఉందన్నారు. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ 60 కంటే ఎక్కువ రెసిడెన్షియల్ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

సమృద్ హెల్త్‌కేర్ నెట్‌వర్క్ సేవల విస్తరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : సమృద్ హెల్త్‌కేర్ నెట్‌వర్క్ సంస్థ వైద్య సేవలను విస్తరించేందుకు ప్రణాళికలను రూపొందించనట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.ఈశ్వర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు ఔషధాలను, వైద్య పరికరాలను అందచేస్తుందన్నారు. ముఖ్యంగా ఒడిశాలోని రాయగడ జిల్లాలో హెల్త్‌కేర్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చామని క్రమంగా అన్ని ప్రాంతాలకు సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -జగ్గయ్యపేట : పట్టణంలోని బస్టాండ్ గ్రేడ్ -1 గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదువుకుని ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. విజ్ఞాన సముపార్జనకు కేంద్రాలైన గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పలుపోటీల్లో విజేతలకు ఆయన బహుమతులందజేశారు. గ్రంథాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** జిల్లా ఉన్నత పాఠశాలలో సభ ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. **మైలవరం :** మైలవరం శాఖ గ్రంథాలయంలో పలు పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బొడ్డపాటి దాసు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు అనేక అంశాలపై, వివిధ రకాల ఆట పాటలు , నిర్వహించారు.జిల్లా గ్రామీణాభివద్ధి కమిటీ సభ్యులు, జెడ్పీటీసీ నాగమణి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో అల్లూరి రామ చంద్రుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజేతలకు కంచికచర్ల ఎంపిపి బషీర్, ఎంఇఒ బాలాజీ బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. **గంపలగూడెం:** గంపలగూడెం, పెనుగొలను, గ్రంథాలయ శాఖలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సోమవారం ప్రోత్సాహకాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు, ఇన్‌ఛార్జిలు సుంకర నాగేశ్వరరావు శ్రీలతలు తెలిపారు. **ఇబ్రహీంపట్నం :** వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.బి.శేషగిరిరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఆఫీసర్ పిల్లలమర్రి హరి నారాయణ ఈ బాలకృష్ణ పాల్గొని పలు పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి డి.చంద్రశేఖర్ పర్యవేక్షించారు.


జగ్గయ్యపేటలో విద్యార్థులకు బహుమతులిస్తున్న సామినేని


గుడివాడలో...


గన్నవరంలో

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కృష్ణాజిల్లాలో గత వారం రోజుల నుంచి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

ప్రజాశక్తి-గుడివాడ: షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విజేతలకు టూటౌన్ సిఐ బి.తులసీధర్ బహుమతులు అందజేశారు. బహుమతులను ప్రముఖ న్యాయవాది సూరపనేని వెంకట పాండురంగారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సురపనేని తేజో కృష్ణ వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి బేరం వెంకటరమణ, డిఆర్పి ప్రసాద్, అవేర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **గన్నవరం:** స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో జరిగిన సభకు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు అధ్యక్షత వహించగా రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షులు, పుణ్యాఛారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గన్నే వెంకట్రావు, కంభంపాటి సూర్యచంద్రరావు, గోగినేని హరికృష్ణ ప్రసాదరావు, చిమట రామారావు, ఎం.ప్రభాకర్ చౌదరి, గ్రంథాలయ ఇన్చార్జి డి.బాబూరావు పాల్గొన్నారు. ముస్తాబాద్‌లో కమిటీ సభ్యులైన విజయ సారథి, షేక్ ఇమామ్, పార్వతి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎల్లిబెత్ రాణి, సర్పంచ్ వేము రాధాకృష్ణ పాల్గొన్నారు. **తోట్లవల్లూరు:** శాఖ గ్రంథాలయంలో సర్పంచ్ పెనుమత్స రాధిక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుష్పనాధం, గ్రంథాలయాధికారి బాబురావు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండలంలోని కవుతరం, అంగలూరు గుడ్లవల్లేరు శాఖ గ్రంథాలలో ఘనంగా వారోత్సవాలు ముగిశాయి. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొడాలి సురేష్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్‌లను గ్రంథాలయ అధికారులు టి వాణి సన్మానించారు. కవుతరం శాఖ గ్రంథాలయ అధికారి బాలాజీ, గ్రామ పెద్దలు వడ్లమడుగు నాగమోహన్, ఈ లక్ష్మణరావు, కానూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. **కోడూరు:** కోడూరు శాఖ గ్రంథాలయ అధికారి పుష్పలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోడూరు జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు తిమ్మన వెంకట నాంచారయ్య, మండల విద్యాశాఖ అధికారి 2 విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, విశ్రాంత గ్రంథాలయ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు. **ఉంగుటూరు:** ఉంగుటూరు గ్రంథాలయ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో సాంబశివరావు మాట్లాడారు. అనంతరం సర్పంచ్ వరప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోఉంగుటూరు గ్రంథాలయ శాఖ అధికారి యు.చంద్రశేఖరరావు పాల్గొన్నారు. **ఆత్కూరు** గ్రంథాలయ శాఖ అధికారి కృష్ణారావు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై సూర్య శ్రీనివాస్ పాల్గొనగా సర్పంచ్ మేరెమ్మ, వార్డు సభ్యులు సింహాచలం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజెఎం కళాశాల కరస్పాండెంట్ భాస్కరరావు, ప్రిన్సిపల్ కరిముల్లా, గ్రామ పెద్దలు రామ్మోహన్ వు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** చల్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాల కృష్ణకుమారి, విద్యాశాఖ అధికారి వరసా వెంకటేశ్వరరావు మాట్లాడారు. గ్రంథాలయా అభివృద్ధి కమిటీ సభ్యులు జివి తాతారావు అంబటి భువనేశ్వర్, జాతీయ ఉపాధ్యాయ ఉత్తమ అవార్డు గ్రహీత కైతపల్లి దాస్, ఉపాధ్యాయులు అడపా గురవయ్య, సి వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్లాసికల్ డాన్స్ ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి కె.గణేష్ కుమార్ పర్యవేక్షించారు. **మోపిదేవి:** మోపిదేవి గ్రంథాలయంలో వారోత్సవాలు ముగింపు సభ జరగగా కావూరి కోదండ రామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొందలపాటి సుబ్బారావు, గ్రామ ప్రముఖులు కంఠంనేని కుటుంబరావు, గ్రంథాలయ అధికారి కె.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. **ఉయ్యూరు:** ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో ఉయ్యూరు చైర్మన్ వి. సత్యనారాయణ, వైస్ చైర్మన్లు ఎస్. సురేశ్, అరతున్నీసా, కౌన్సిలర్ కె.వెంకటలక్ష్మి, శివాలయం చైర్మన్ కుటుంబరాజు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు అబుకలాం, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొలసాని రవి, గ్రంథాలయ అధికారిణి బి.రమణి పాల్గొన్నారు. **పమిడిముక్కల** మండలం గురజాడ గ్రామంలోని శాఖ గ్రంథాలయంలో ఉయ్యూరు సిడిసి చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి:** పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో ఈఓపిఆర్‌డి వంగా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి గోగం సురేష్, సర్పంచ్ చప్పిడి సమీర, వైస్ యంపిపి పొనుగుమాటి రజనీ, యంపిడిఓ టి.సీతామహాలక్ష్మీ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యం.భవానీ, యంఇఓ-2 వి.సురేష్, ఎల్మర్ గ్రంథాలయంలో సర్పంచి కొల్లూరి అనూష, వెంట్రప్రగడ గ్రంథాలయంలో సర్పంచి అప్పికట్ల ఆశాజ్యోతి, పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర చీకుర్తి వరప్రసాద్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తుంగల సమితి దేవి, గ్రంథాల అధికారి జె ప్రభుదాస్ పాల్గొన్నారు. **ఘంటసాల:** ఘంటసాల గ్రంథాలయంలో ఎంపీపీ వేమూరి రజిని కుమారి, గ్రంథాలయ అధికారి ఎం శరత్ కుమార్, వ్యవసాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే లహరి, సర్పంచ్ బి వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. శ్రీకాకుళం శాఖ గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. గ్రంథాలయ అధికారిణి దారా సుజాత, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం భువనేశ్వరి, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నాగబాబు పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్:** బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోడే బోయిన బాబి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాటక అకాడమీ డైరెక్టర్ నక్క గాంధీ, ఎంపీపీ వై నగేష్, సర్పంచ్ పిల్లా అనిత, గ్రంథాలయ అధికారి స్వర్ణలతాదేవి పాల్గొన్నారు.

బీచ్‌లో సందర్శకులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి : జెసి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాల సందర్భంగా మంగినపూడి బీచ్‌కు అధిక సంఖ్యలో వచ్చే యాత్రికుల సౌకర్యానికే తొలి ప్రాధాన్యమివ్వాలని కృష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం ఆమె మంగినపూడి బీచ్‌ను సందర్శించి వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి డాక్టర్ అపరాజిత సింగ్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ, ఈ నెల 26 (ఆదివారం), 27 తేదీల్లో మంగినపూడి బీచ్‌కు లక్ష నుండి రెండు లక్షల మంది భక్తులు సముద్ర స్నానాలు చేసేందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీ దష్ట్యా వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

కొండాలమ్మ గుడి హుండీల లెక్కింపు

సొమ్ము దొంగిలించిన అర్చకుడిపై చర్యలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: వేమవరం గ్రామంలోని కొండలమ్మ దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. 57 రోజులకు రూ.26,17,156 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం గోపి, గోపాల రావు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. హుండీ లెక్కించే సమయంలో సంతోష్ శర్మ అనే అర్చకుడు పంచలో సొమ్మును దాచినట్లు ధర్మకర్తల మండలి సభ్యులు కొమ్మనబోయిన రవిశంకర్ తనిఖీ అధికారికి తెలిపారు. ఆయన ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో అర్చకుడిని తనిఖీ చేయగా రూ.27 వేలు దొంగిలించినట్లు నిర్ధారించారు. అర్చకుడు సంతోష్ శర్మను అతనికి సహకరించిన రికార్డు అసిస్టెంట్ కృష్ణ కుమార్‌పై శాఖపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కొడాలి వ్యాఖ్యలపై వెనిగండ్ల ఆగ్రహం

ప్రజాశక్తి-గుడివాడ: టిడ్కో ఇళ్లు అంటే చంద్రబాబునాయుడి పేరు గుర్తొస్తుందని టిడిపి నాయకులు వెనిగండ్ల రాము అన్నారు. వెనిగండ్ల రాము కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ గుడివాడ ప్రజలకు రోడ్లు అవసరం లేదన్న కొడాలి నాని వ్యాఖ్యలపై రాము మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో ప్రతి పథకం నిర్వీర్యం అవుతుందని, పథకాలు ఇస్తున్నామని చెప్పుకుంటున్న వైసిపి నాయకులు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయో సరిచూసుకోవాలన్నారు. హైదరాబాదులో ఉండే కొడాలికి గుడివాడలో ప్రజలు పడే కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. అభివృద్ధి అర్థం తెలియని కొడాలి నానిని నాలుగు దఫాలుగా గెలిపించినందుకు సిగ్గుపడుతున్నామని గుడివాడ ప్రజలు చెబుతున్నారన్నారు. గుడివాడలో కొడాలి నాని కారణంగా ఒక తరం వెనుకబడిపోయిందన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పంప్రాజు సాంబశివరావు, గుత్తా చంటి, దేవరపల్లి కోటి, మిక్కిలినేని రమేష్, గడ్డం ప్రకాష్ దాస్, అందుగుల ఏసుపాదం, తుమ్మలపల్లి, శంకరంపాడు సర్పంచ్‌లు సింగాల రాధాకృష్ణ, కైలే సుబ్బారావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం : కైలే

ప్రజాశక్తి-పెదపారుపూడి: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగన్‌కు దక్కుతుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సోమవారం పెదపారుపూడి మండలం వెంట్రాప్రగడ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని కైలే అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, మండల అధ్యక్షులు గోళ్ల సోమేశ్వరరావు, పామర్రు మార్కెట్ డైరెక్టర్ డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, సర్పంచి అప్పికట్ల ఆశాజ్యోతి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో అవకతవకలకు పాల్పడితే కేసులు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ధాన్యం సేకరణ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పెద్ది రోజా, జిల్లా అధికారులు క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం సేకరణ, వసతి గృహాల తనిఖీ-మరమ్మతులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుభరోసా కేంద్రాల పనితీరు పరిశీలించాలన్నారు.

సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కారం చేయాలనే దక్షతతో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జాషువా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సమస్యను ఒక ప్రత్యేక కోణంలో నిశితంగా గమనించి సమస్య పరిష్కారానికి తగిన సమయంలో చట్టపరమైన చర్యలు తీసుకొని వారికి పోలీస్ వారిపై నమ్మకాన్ని పెంపొందిస్తామన్నారు. ప్రజలకు చట్ట పరంగా న్యాయం అందించడానికి కృష్ణాజిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-గన్నవరం: సావరగూడెంలో ఇద్దరు విద్యార్థులు ఫోటోషూట్ కోసం వచ్చి చెరువులో ప్రమాదవశాత్తు పడి మతిచెందడంతో ఎస్పీ పి జాషువా ఆదేశాల మేరకు గన్నవరం డిఎస్పి ఆర్‌జి జయసూర్య ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గన్నవరం సిఐ పి.కనకారావు, సర్పంచ్ అట్ల నాగేశ్వరరావుతో కలిసి చెరువు వద్ద ప్రమాద సూచికలను పెట్టడం జరిగింది. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలని ఈ సూచికలు ఏర్పాటు చేయటం జరిగిందని సిఐ తెలిపారు. ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటం వల్ల అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు.

ఇప్పటికైనా జగన్ కళ్లు తెరవాలి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబునాయుడికి రెగ్యులర్ బెయిల్ మంజూరు జగన్‌కు చెంపపెట్టు అని, ఈ కేసులో చంద్రబాబు పాత్రపై కనీసం ప్రాథమిక ఆధారాలు కూడా లేవని కోర్టు స్పష్టం చేసిందని టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. హైకోర్టులో చంద్రబాబుకు బెయిల్ రావడం పట్ల గన్నవరంలో టపాసులు కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు తీర్పుతోనైనా జగన్ కళ్లు తెరవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, మండవ లక్ష్మి, రామారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఆయుష్మాన్ కార్డులు : ఎండిఒ


ప్రజాశక్తి-ఉంగుటూరు: ఆయుష్మాన్ కార్డులను ప్రతి ఇంటికి వెళ్లి అందించి వాటి ఉపయోగాలు తెలియచేయాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. సోమవారం ఆయుష్మాన్ కార్డుల పంపిణీ వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ ఆయుష్మాన్ కార్డులు ఇంటింటికి పంపిణీ చేయాలని వాటి ఉపయోగాలను పూర్తిస్థాయిలో వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.సాంబశివరావు, ఈవోపీఆర్డి బాషా పాల్గొన్నారు.

3న మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): 2023-24 విద్యా సంవత్సరములో జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ మీన్స్-కం-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష డిసెంబర్ 3న ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి తాహెర సుల్తానా తెలిపారు.కాబట్టి ఈ పరీక్షకు హాజరవుచున్న విద్యార్థిని విద్యార్థుల యొక్క హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచలకుల కార్యాలయపు వెబ్ సైట్ www.bse.ap.gov.in నందు స్కూల్ లాగిన్ లో అందుబాటులో ఉంచడమైనది కావున సంబంధిత ఉపాధ్యాయుల పాఠశాల యు - డైస్ కోడ్ ను ఉపయోగించి లాగిన్ అయి తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల యొక్క హాల్‌టికెట్లను డౌన్లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు.

రాయితీపై మినుము విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల: మండల పరిధిలోని దేవరకోట గ్రామంలో ఏఎంసీ చైర్మెన్ వేమూరి వెంకటరావు సోమవారం రైతులకు రాయితీపై మినుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు 30 శాతం రాయితీపై మినుము విత్తనాల పంపిణీ చేయటం జరిగిందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ పథకాల పట్ల అవగాహన పెంచుకోవాలని, నాణ్యమైన విత్తనాలను స్వయంగా గ్రామాల్లోని ఆర్బికేల ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. మండల వ్యవసాయశాఖాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు 40 క్వింటాళ్ల ఎల్.బి.జి -752 రకం మినుము విత్తనాలు సరఫరా చేయటానికి గానూ రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.



విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకళ్లతో సంబంధిత రైతు భరోసా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొప్పుల రాములమ్మ, వేమూరి వెంకట రాజేంద్ర ప్రసాద్, వీఏఏ సత్యదేవ్ పాల్గొన్నారు.

గన్నేను కలిసిన వివిధ పార్టీల నేతలు


గన్నెను కలిసిన పలువురు నాయకులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం: టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా)ని రెడ్డిగూడెం మండలా నికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమ వారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారిలో బిజెపి మండలం మాజీ అధ్యక్షులు కందుకూరి నాగేశ్వరావు, కూనపరాజు పర్వ మాజీ వైసిపి నాయకులు పూల వెంకటేశ్వరావు, జనసేన రెడ్డిగూడెం, మైలవరం మండల అధ్యక్షులు కాంతారావు, శీలం బ్రహ్మయ్య, మైలవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాత పోతురాజు, కార్యదర్శి చల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయునికి నివాళులు



ప్రజాశక్తి - గంపలగూడెం: మండలం లోని పెద్దకొమెర గ్రామ నివాసి పాపినేని లక్ష్మీనారాయణ (80) ఆదివారం రాత్రి మతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె. లక్ష్మీనారాయణ 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా సేవలందించారు. పిఆర్‌టియు శాఖ అధ్యక్షునిగా దీర్ఘకాలం పని చేశారు. ఆయన మతదేహాన్ని డిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు బూరుగు జమలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోదా వెంకటరామయ్య, పిఆర్‌టియు మండల అధ్యక్షులు అట్లూరి సుధాకర్ రెడ్డి, డిపిఆర్‌టియు మండల అధ్యక్షుడు నల్గొండ నరసింహారావు, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, పి.ఏడుకొండలు, వివిధ పార్టీల నాయకులు లక్ష్మీనారాయణ మతదేహాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. మతుని కుమారుడు అమెరికాలో ఉండటంతో అంత్యక్రియలు మంగళవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

7న సామాజిక న్యాయ మహాసభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇన్‌ఫాం సంస్థ విద్యావంతులచే స్థాపించి పది సంవత్సరాలైన సందర్భంగా డిసెంబర్ 7న అనుమోలు గార్డెన్స్, తాడిగడప విజయవాడలో 'మాదిగల సామాజిక న్యాయ మహాసభ' నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఫాం ఇంటర్నేషనల్ అధ్యక్షులు గెడ్డం బాపిరాజు తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్‌ఫాం వినూత్నంగా మాదిగ సంపదను గ్రామాలకు అనుసంధానం చేస్తూ సెమినార్‌లు 'పల్లెలను పలకరిద్దాం', 'పల్లెబస' ద్వారా చైతన్య పరచడానికి పది సంవత్సరాలుగా పనిచేస్తుందని, చట్టసభల్లో సమాన అవకాశాలు, ఏజెన్సీలో మాదిగలు- స్థితిగతులు, మాదిగల అభివృద్ధి కోసం ఐఎం సిటిఐ (ఇంటర్నే షనల్ మా దిగ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ) తెలిపారు. మాదిగ జాతిలో ఉన్న ప్రజా నాయకులు నందిగం సురేష్ ఎంపి, హెూం, విపత్తుల శాఖమంత్రి తానేటి వనిత, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ గౌరవ అతిథిలుగా పాల్గొంటున్నారని తెలిపారు.

రైతుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వత్సవాయి : సిఎం జగన్ రైతుల అభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్. స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయభాను వైఎస్ఆర్ జల కళ పథకం ద్వారా వచ్చిన మోటార్లను డబ్బాకుపల్లి, పొలంపల్లి, గ్రామ రైతులకు అందించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ బి.రమేష్ బాబు, ఎంపిపి కొలుసు రమాదేవి, జెడ్‌పిటిసి ఏసుపోగు దేవమని, వత్సవాయి గ్రామ సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఉపాధి హామీ ఎపిఒ రాఘవ పాల్గొన్నారు.

పైపు లైన్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ : ప్రతి ఇంటికి సుక్షితమైన తాగునీటిని అందజేయడమే లక్ష్యంగా జల జీవన్ మిషన్ పనులు ఏ పల్లెలోనూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. అల్లూరు గ్రామంలో జల జీవన్ మిషన్ పనులను నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు ఏర్పాటు పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

దుర్గాఘాట్లో నదీ స్నానాలు పున : ప్రారంభం


నదీ స్నానాలాచరిస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానానికి సమీపంలోని దుర్గాఘాట్ కృష్ణా నదీ స్నానం చేసేందుకు ఎట్టకేలకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో సోమవారం నుండి పవిత్ర దుర్గ ఘాట్‌లోని పవిత్ర కృష్ణా నదిలో యాత్రికులు పవిత్ర స్నానమాచరించుటకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ ఆధ్వర్యంలో పవిత్ర దుర్గా ఘాట్ వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, పవిత్ర స్నానాలను ప్రారంభించారు. గత కొంతకాలంగా దుర్గాఘాట్ కృష్ణా నదీ స్నానాలను నిలిపివేసిన విషయం విధితమే. అయితే చాలామంది భక్తుల కోరిక మేరకు, కార్తీక మాసం నేపథ్యంలో చాలామంది ప్రజలు పలు ప్రాంతాల నుంచి నదిలో దిగి స్నానం చేయాలని సంకల్పం ఉంటుంది. అంతేగాక కార్తీక మాసంలో దుర్గా భవానీలు, అయ్యప్పలు ప్రతిరోజూ నదీ స్నానం చేస్తుంటారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు మారుతీ యజ్ఞ నారాయణ, కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమాదేవి మరియు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాలలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం

రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : బాలల హక్కులను పరిరక్షించి బంగారు భవిష్యత్తును అందించడంతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ పిలుపునిచ్చారు.బాలల హక్కుల వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మాకినేని బసవపున్నయ్య భవన్‌లో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (సీఆర్‌ఏఎఫ్), జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు వేడుకలకు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా హాజరై సుస్థిర అభివద్ధి లక్ష్యాలు సాధిద్దాం-బాలల హక్కులు రక్షిద్దాం, దత్తత ద్వారా తల్లిదండ్రులు-బాలల హక్కు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న బాలల హక్కుల చట్టాలను సమర్థవంతంగా అమలుచేసినప్పుడే చిన్నారులకు బంగారు భవిష్యత్తును అందించగలుగుతామన్నారు. బాల్యవివాహాలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నప్పటికీ ఇంకా అక్కడక్కడ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని.. బాలల హక్కులు, చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అడిషనల్ డిసిపి వెంకటరత్నం, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి మాట్లాడుతూ 6-14 ఏళ్ల పిల్లలకు కల్పిస్తున్న ఉచిత నిర్బంద విద్యను అమలుచేయడంలో లింగ వివక్షతను రూపుమాపడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, ఎస్సీపీసీఆర్ మెంబర్ రాజేంద్రప్రసాద్, దిశ ఏసీపీ వీవీ నాయక్ పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మోసపూరిత మాటలను నమ్మొద్దని ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనేందుకు దుష్ట చతుష్టయం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఉదయభాను పిలుపునిచ్చారు. జగ్గయ్యపేటలో ఈనెల 24న జరగనున్న సామాజిక సాధికార యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి జగ్గయ్యపేట మండలంలోని గండ్రాయి, మల్కాపురం, షేర్ మహమ్మద్ పేట గ్రామాల్లో కార్యకర్తల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. 'నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ" అంటూ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. అప్పటికీ ఇప్పటికి పింఛన్ల పంపిణీలో ఉన్న తేడాను ప్రజలు గుర్తించాలని సూచించారు. 24న జగ్గయ్యపేటలో ప్రతిష్టాత్మకంగా జరగబోయే సామాజిక సాధికార యాత్రకు ప్రతి ఇంటినుంచి తరలిరావాలని ఉదయభాను పిలుపునిచ్చారు.

విత్తు నుంచి విక్రయం వరకు అండగా

ఆర్‌బికె ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎ వసంత


రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : విత్తు నుంచి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించే వరకు రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు ఉపయోగపడుతున్నాయని మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకటకష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. రెడ్డిగూడెం-2 సచివాలయం పరిధిలో రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతుభరోసా కేంద్ర భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కష్ణప్రసాదు మాట్లాడుతూ ఆర్బీకేల ఏర్పాటుతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కేవలం సాగు ఉత్పాదకాలు రైతు ముంగిట అందించడమే కాకుండా సర్టిఫై చేసిన నాణ్యమైన ఉత్పాదకాల పంపిణీతో పాటు రైతుల్లో సామర్థ్యం పెంపు, పరిశోధనా ఫలాలు రైతు క్షేత్రాలకు చేరవేయడం, పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ-క్రాప్ బుకింగ్, రైతు సంక్షేమ పథకాల అమలులో ఆర్బీకేలు పారదర్శకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వివి రోడ్డు అభివద్ధికి రూ.40 కోట్లు విజయవాడ-విస్సన్నపేట రహదారి విస్తరణతో కూడిన అభివద్ధికి కందులపాడు నుంచి పాతనాగులూరు వరకు రూ.40 కోట్లు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయన్నారు. పాతనాగులూరు నుంచి విస్సన్నపేట వరకు రహదారి అభివద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

22, 23 తేదీల్లో ఇంటెలిజెన్స్‌పై సదస్సు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆ నెల 22, 23 తేదీల్లో 'రసాయనశాస్త్రంలో అర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ పాత్ర, ప్రస్తుత ప్రగతి, రానున్న పరిస్థితులు' అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో సదస్సు పోస్టర్‌ను తూనికుంట్ల శ్రీనివాసు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావుతో కలిసి సోమవారం ఆవిష్కరించారు.

నేడు గ్రూప్2 పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: కష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుచే గ్రూప్ - 2 పరీక్షల నూతన సిలబస్‌పై నేడు సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని ఎస్జీఎస్ కళాశాలలోని యూజీసీ బ్లాక్‌లో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జగ్గయ్యపేట శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భాను పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమమంలో జగ్గయ్యపేట మండలంలోని యుటిఎఫ్ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, గ్రూప్ - 2 పరీక్షల అభ్యర్థులు పాల్గొని జయప్రదం చేయలని కోరారు.


మాట్లాడుతున్న కల్యాణ్

27,28 తేదీల్లో మహాధర్నా

విస్సన్నపేట : నవంబర్ 27 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నా జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.నాగరాజు కోట కళ్యాణ్ కోరారు. విస్సన్నపేట సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 సంవత్సరాల కాలంలో ప్రభుత్వ విధా నాల వల్ల వ్యవసాయం నిర్లక్ష్యానికి గురై రైతుల ఆత్మహత్యలు పెరిగాయని రైతు ఆర్థికంగా చితికిపోయాడని ప్రభుత్వ రంగాన్ని అమ్మివే స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చట్టం తెచ్చి ఉచిత విద్యుత్తును ఎత్తివేశార న్నారు. రైతులు వ్యవసాయ కార్మికులు కార్మిక వర్గం ఈ ప్రభుత్వ హయాంలో రోడ్డును పడ్డార న్నారు. నాగరాజు మాట్లాడుతూ విస్సన్నపేటను కరువు మండలంగా ప్రకటించాలన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టాలని వినతి

ప్రజాశక్తి- నందిగామ : మండల టిడిపి ఆధ్వర్యంలో బెల్ట్ షాపులను అరికట్టాలని నంది గామ రెవిన్యూ డివిజన్ అధికారి సాయిబాబాకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షు లు వీరంకి వీరాస్వామిన్, ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, జనసేన నాయకులు వెంకటరావు మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో సుమారుగా 200 పైబడి బెల్ట్ షాపులు ద్వారా మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఎస్సీ సెల్ నాయ కులు వేల్పుల బిక్షాలు, యూనిట్ ఇన్చార్జి గరి మెడి సురేష్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండుతున్న వరి... ఆందోళనలో రైతులు



పొలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సిపి రెడ్డి

ప్రజాశక్తి-గుడివాడరూరల్

చేతికి వస్తుందనుకున్న పంట సర్వనాశనం అవ్వడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వరి సాగు చేసినా నీటి ఎద్దడితో పంట కళ్ల ఎదుటే ఎండిపోతున్నా ఏమి చెయ్యాలో పాలుపోని పరిస్థితి రైతాంగానిది. ధనియాలపేట ఉత్తరభాగం కాలువలో చుక్కనీరు లేకపోవడంతో ఆ కాలువ పరిధిలో వంద ఎకరాలు పూర్తిగా ఎండిపోయాయి. భూమి నెర్రనిచ్చి దిగుబడి పై తీవ్ర ప్రభావం చూపింది. తొలకరిలో రైతులు వెదజల్లి మూడు సార్లు ఊడ్చారు. అధిక వర్షాలకు చేలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు తీవ్ర నీటి ఎద్దడికి పంట పూర్తిగా దెబ్బతింది. వరి చేలు పొట్ట దశలో పై గింజలు కొద్దిగా పాలుపోసుకున్న నీరు లేక కింద కంకిలో ఎండిపోయే పరిస్థితిలో వరిచేలు ఉన్నాయి. ముపై బస్తాలు దిగుబడికి ప్రస్తుతం ఐదు బస్తాలు దిగుబడి వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నీటి ఎద్దడితో రెండో పంటగా మినుము వేసుకునే పరిస్థితి లేదు.

అధికారులు మాగోడు పట్టించుకోలేదు

మట్లపూడి నాగమల్లేశ్వరరావు (పాములు)
గుడివాడ మండల కౌలు రైతు కార్యదర్శి



పది ఎకరాలు పొలం కౌలుకు చేస్తున్నాను. రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టాను. చంద్రయ్య కాలువలోకి మోటారు ఇంజను పెట్టి తడిపి ఒక తడికి కాపాడాను. మూడు నెలల నుంచి కాలువలో నీరు లేక నా పొలం ఎండిపోయింది. వ్యవసాయ అధికారులకు, కలాసుకు ఎన్ని సార్లు విన్నవించుకున్న మా గోడు పట్టించుకోలేదు. డ్రాపులేని చోట అడ్డం పెట్టి దింటకుర్రు, భూషణగుళ్ల, కలవపాముల వారికి నీళ్ల వదిలి మమ్ములను పట్టించుకోలేదు.

నీరు దిగువకు రానివ్వడంలేదు

కొత్తకోట అప్పలనాయుడు



నేను మూడున్నర ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టాను. నీళ్లలేక నా పొలం పూర్తిగా చచ్చిపోయింది. రెండు నెలల నుంచి నీటి కోసం ఎగువ రైతులతో గొడవలు పడుతున్నాం. వారు కాలువలకు అడ్డం పెట్టి నీరు దిగువకు రానివ్వడం లేదు. ఏమి చెయ్యాలో దిక్కుతోచడం లేదు. పొట్టదశలో ఉన్న పొలాలకు ఇప్పటికైనా నీరు విడుదల చేస్తే ఎంతైనా రైతులకు మేలు చేసిన వారవుతారు.

పంట సర్వనాశనం అయింది

యడ్ల అప్పలనాయుడు,
ధనియాలపేట.



నేను ఐదున్నర ఎకరాలు వ్యవసాయం చేస్తున్నాను. ఇప్పటికి రూ.1.50 లక్షలు ఖర్చుచేశాను. పొట్టదశలో నీరులేక పంట సర్వనాశనం అయింది. పంట మొదటి సారి మొలవక, రెండవ సారి వర్షాలకు మునిగిపోయి, మూడవ సారి నీళ్ల లేక పంట సర్వనాశనం అయింది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

ఆర్‌సిపి రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి, గుడివాడ.

ధనియాలపేట ఉత్తరభాగం కాలువ పూర్తిగా ఎండిపోయింది. ఈ కాలువ ద్వారా రైతులకు చుక్కనీరు దక్కక వంద ఎకరాల పంట పూర్తిగా దెబ్బతింది. భూమి ఎండిపోయి, నెర్రలిచ్చి పంట పూర్తిగా దెబ్బతింది. పొట్టపోసుకునే దశలో నీరులేక దిగుబడిపై ప్రభావం చూపింది. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది.



సౌదారాణి కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-ఉయ్యూరు: విధి నిర్వహణలో మరణించిన సౌదారాణి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇంటి స్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ సోమవారం ఉయ్యూరు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి జి.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు చౌటుపల్లి రవి, అంగన్వాడి వర్కర్స్ నాయకులు సువర్ణ లత, విజయలక్ష్మి ఇందిరా ప్రాజెక్ట్ లీడర్ లత, సిఐటియు నాయకులు తాడంకి నరేష్, సజ్జ బాలగంగాధర్, బి.రాజేష్, బి.కీర్తి పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈ నెల 13న చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద చల్లపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కళ్లేపల్లి చంద్ర ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం అందించేందుకు, ఇద్దరు పిల్లలకు చదువుకు సహాయసహకారాలు అందించాలని, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని మచిలీపట్నంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబుకి దివిసీమ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తరుపున వినతిపత్రం సమర్పించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించడం గుర్తించదగిన పరిణామమని జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ స్థాయి అంతర ఇంజనీరింగ్ కళాశాలల టోర్నమెంట్ క్రీడల పోటీలు సోమవారంతో ముగిశాయి. పురుషులు మరియు మహిళలు విభాగాల్లో వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖో-ఖో, కబడ్డీ, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలు మరియు అథ్లెటిక్స్‌లో పోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారులకు మరియు జట్లకు బహుమతి ప్రదానోత్సవ సభ కళాశాల సెంట్రల్ లెక్చర్ థియేటర్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి. జాషువా, ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్, 100 మీటర్ల హర్డిల్స్ లో ప్రత్యేకత సాధించిన ప్రఖ్యాతి పొందిన జ్యోతి ఎర్రాజీ గౌరవ అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

కృష్ణా జిల్లా ఎస్.పి. జాషువా మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడలలో కూడా రాణించడం గుర్తించదగిన పరిణామమని ఆయన అన్నారు. క్రీడాకారుడు లేదా క్రీడాకారిణి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారనీ, వ్యయ ప్రయాసలకు ఓర్చి మూడు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన అథ్లెట్ జ్యోతి ఎర్రాజ్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు కూడా వివిధ క్రీడలలో రాణించి తారా స్థాయికి ఎదిగిన విధానాన్ని గుర్తుచేశారు. క్రీడలపై ఆసక్తి పెంచుకుని, క్రమశిక్షణాయుత ప్రణాళిక ద్వారా దేశానికి ప్రాతినిధ్యం వహించ వచ్చునని స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తదితరులు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. వివిధ కళాశాల నుండి ఈ జాతీయ స్థాయి క్రీడల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు 5 లక్షల విలువ గల బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు వల్లూరుపల్లి, సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యనారాయణ వల్లూరుపల్లి, కో సెక్రటరీ, కరస్పాండెంట్ రామకృష్ణ వల్లూరుపల్లి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండరామారావు, డాక్టర్ శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

'సాహిత్య తరంగిణి' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-ఉయ్యూరు: మందలో ఒకరిగా కంటే వందలో ఒకరిగా ఉండాలనే తపనతో విద్యార్థులు జీవితాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శ్రీశ్రీనివాసా విద్యాసంస్థల ఆవరణలో సరసభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సరస కవిరాజు విద్వాన్ నవ్వులూరి రమేశ్ బాబు రచించిన కృష్ణాజిల్లా సాహిత్య తరంగిణి గ్రంథ ఆవిష్కరణ సభలో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. సరసభారతి అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీనివాసా విద్యాసంస్థల అధినేత పరుచూరి శ్రీనివాసరావు, జిల్లా రచయి తల సంఘం ముఖ్య కార్యదర్శి చలపాక ప్రకాశ్, గాజుల సత్యనారాయణ, విశ్రాంత తె లుగు అధ్యాపకుడు స్వర్ణరాజా హనుమంతరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చల్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సరసభారతి కోశాధికారి గబ్బిట వెంకటరమణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



'మున్సిపల్ కమిషనర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలి'


ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గత రెండు సంవత్సరాల నుండి జిల్లా మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అమలు చేయని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం స్పందన కార్యక్రమంలో డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ తరపున ప్రముఖ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నంలో యూనియన్ బ్యాంకు కేటాయించిన 40 కోట్ల రూపాయలతో స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ నిర్మాణం అంశంపై గత రెండు సంవత్సరాల నుండి కౌన్సిల్ అజెండాలో పెట్టకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జిల్లా అభివద్ధి కమిటీ సమావేశంలో ఎంపి వివరణ కోరిన కూడా మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టాభి మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ సభ్యులు వేమూరి రామకృష్ణారావు, ఏ ఆర్ కే మూర్తి, పి.వి.ఫణి కుమార్, పుప్పాల ప్రసాద్, వివిఎస్ఎస్‌ఆర్ శర్మ, మోపర్తి సుబ్రమణ్యం, బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను సోమవారం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మణరావు తెలిపారు. ఈ వారోత్సవాలను నవంబర్ 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం వారోత్సవాలను రోగి ఆరోగ్య సంరక్షణకై ఫార్మసిస్టుల ముఖ్యపాత్ర అనే అంశంపై నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెయింట్ మేరీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ చేబ్రోలు నుండి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్కె ఆఫ్రల్ బాష పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధికి కొత్త ఔషధాలను రూపొందించడం అనే అంశంపై సెమినార్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐపిఎ గుడ్లవల్లేరు శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.కె అమీనాభి, తో పాటు అధ్యాపకులు డాక్టర్ పి రవిషా, డాక్టర్ పి ప్రశాంతి డాక్టర్ టి బాలకష్ణ, టి శ్రావణి పాల్గొన్నారు.

రచయిత పీటర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: పర్యావరణ పరిరక్షణ ప్రజల భాగస్వామ్యంపై చదివిన కవితలకు సినీ గేయ రచయిత గుండా బత్తిన మరియ పీటర్‌కు ప్రశంసలు అందాయి. విజయవాడలో ఈ నెల 19వ తేదీన మాకినేని బసవ పున్నయ్య కేంద్రంలో అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 125వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ ప్రజల భాగస్వామ్యంపై ప్లాస్టిక్‌ని వాడడం వల్ల వచ్చే చెడు ఫలితాలను కవితల రూపంలో చదివిన పీటర్‌ను తెలుగు అకాడమి చైర్ పర్సన్ పిల్లంగోళ్ల లక్ష్మి, శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సర్టిఫికేట్, మెమెంటో, శాలువాతో సత్కరించారు. స్థానిక ఎంపీడీవో ఆఫీస్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న పీటర్‌ను ఎంపీడీవో దారపు శ్రీనివాస్, తాసిల్దార్ అబ్దుల్ రహమాన్, ఇఓపిఆర్డి దిలీప్ కుమార్, డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, మండల అధికారులు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



టిబి రోగులకు కొహెన్స్ లైఫ్‌సైన్సెస్ రూ.38 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విజయవాడ : టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు జగ్గయ్యపేట నియోజకవర్గం ముక్త్యేశ్వరపురంలోని కొహెన్స్ లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద రూ.38 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చిందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని పేదల అభివద్ధిలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో కొహెన్స్ లైఫ్‌సైన్సెస్ సంస్థ ప్రతినిధులు సోమవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ డిల్లీరావును కలిసి టీబీ వ్యాధిగ్రస్తుల సహాయార్థం రూ.38 లక్షల ఆర్థిక సహకారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ఉదయభానుతోపాటు కనెక్ట్ ఆంధ్రా సీఈవో కె.శివశంకర్, కొహెన్స్ లైఫ్‌సైన్సెస్ ఆపరేషన్స్ హెడ్ ఎంఎస్ఎన్ రెడ్డి, సీఎస్ఆర్ హెడ్ పీఎస్ఎన్ మూర్తి, కార్పొరేట్ అఫైర్స్ సీనియర్ జీఎం బాలాజీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ పాత గేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు కారు చౌకగా విద్యుత్ రంగాన్ని కట్టపెట్టేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ సవరణ బిల్లు 2020ను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈధర్నాలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజినల్ ప్రెసిడెంట్ వేముల నాగరాజు, వైస్ ప్రెసిడెంట్‌లు సోమా పాపయ్య, బొమ్మ సాని సురేష్, సింహాద్రి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.





స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాల పాత్ర కీలకం : ఎంఎల్ఎ విష్ణు

ప్రజాశక్తి - విజయవాడ : గ్రంథాలయాలు స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించాయని సెంట్రల్ ఎంఎల్ఎ మల్లాది విష్ణువర్ధన్ అన్నారు. పురాతన గ్రంథాలయాల్లో ఒకటిగా ఉన్న ఠాగూర్ స్మారక గ్రంధాలయం ద్వారా ఎంతో మందిని విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. గవర్నరుపేటలోని ఠాగూర్ స్మారక గ్రంధాలయంలో సోమవారం 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గత వారం రోజులుగా విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల్లో పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌శ్రీ మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ సాహితీ వేత్త గుమ్మా సాంబశివ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ, పౌర గ్రంథాలయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దీక్షితులు, విజయవాడ ఆర్ట్ సొసైటీ కార్యదర్శి కొలుసు సుబ్రమణ్యం, గ్రంథాలయ అధికారి కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో...

సత్య నారాయణ పురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు సభ, బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు వర్ధన్, 33వ, డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, శారదా కాలేజీ ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారంరోజులుగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం జరిగింది.

అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవానికి అందరినీ ఆహ్వానించాలి



ప్రజాశక్తి - విజయవాడ : స్వరాజ్య మైదానంలో చేపట్టిన అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవానికి అన్ని రాజకీయ పార్టీలను, దళిత, ప్రజా సంఘాలను ఆహ్వానించాలని మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి ఆవిష్కరణకు సన్నాహాలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విగ్రహ నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.కోటేశ్వరరావు, ఆవుల శేఖర్, బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ భవనం తిరిగి అప్పగింతకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఆఫీసర్స్ క్లబ్ భవనాన్ని తిరిగి అప్పగించేందుకు తనవంతు కృషిచేస్తానని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు క్లబ్ సభ్యులకు తెలిపారు. గతంలో డీజీపీ కార్యాలయానికి అప్పగించిన విజయవాడ గోపాల్‌రెడ్డి రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్ భవనాన్ని తిరిగి అప్పగించాలని క్లబ్ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు సీఎం కిరణ్, పి.లలిత్‌కుమార్, కె.శివ శంకర్ రావు, డా.ఎల్. శ్రీనివాస రావు పాల్గొన్నారు.



NAME CHANGE

I, Gupta Sheetal Kumari Devanand W/o Bolbanda Vivekanand Narasimulu R/o D No 40-9-39, Radha Vihar, SBI Offiers Colony, Acharaya Nagar, Benz Cercle, Vijayawada-520010, NTR District, Andhra Pradesh, India. have changed my name from GUPTA SHEETAL KUMARI DEVANAD to BOLBANDA SHEETAL a vide affidavit dated 20-11-2023 before Notary.

పాస్‌పోర్టు పోయినది

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కంచికచర్ల గ్రామానికి చెందిన కొంద్రగుంట శాంతి శ్రీ (భర్త) వెంకట్రావు కు చెందిన పాస్ పోర్ట్ పోయినది. 1999 లో రిపబ్లిక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయం వారు జారీ చేసిన పాస్ పోర్ట్ నెంబర్ **A7168556** పోయినది. ది.15.11.2023 వ తేదీన కంచికచర్ల లోని ఇంటివద్ద నుండి జిరాక్స్ కోసం బస్టాండ్ వైపు వస్తుండగా మార్గమధ్యంలో చేతితో పట్టుకున్న పాస్ పోర్ట్ కవర్ జారి పోయినది. పై పేరుతో గల పాస్ పోర్ట్ దొరికిన వారు 9640766695 మొబైల్ నెంబర్ కు సమాచారం అందించగలరు.

పాస్‌పోర్టు పోయినది

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కంచికచర్ల గ్రామానికి చెందిన కందుల వెంకట్రావు (తండ్రి) శేషగిరిరావు కు చెందిన పాస్ పోర్ట్ పోయినది. 2014 లో రిపబ్లిక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయం వారు జారీ చేసిన పాస్ పోర్ట్ నెంబరు **M3262453** పోయినది. ది.16.11.2023 వ తేదీన కంచికచర్ల లోని ఇంటివద్ద నుండి జిరాక్స్ కోసం బస్టాండ్ వైపు బైక్ పై వస్తుండగా మార్గమధ్యంలో బైక్ ట్యాంక్ కవర్ లో ఉంచిన పాస్ పోర్ట్ కవర్ జారి పోయినది. పై పేరుతో గల పాస్ పోర్ట్ దొరికిన వారు 9848409354 మొబైల్ నెంబర్ కు సమాచారం అందించగలరు.

IN THE COURT OF THE CHAIRMAN MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-XXVII ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT :: SECUNDERABAD
M V O P NO: 249 of 2023

Between:
Jakkula Chandramouli and Others ...Petitioner
AND
Adusumilli Sangeeta and Others ...Respondents

To,
1.Adusumilli Sangeeta C/o Anitha Age: Major,Occupation: Business R/o Flat No: 302,potluri Residency,Beside Carmil Church Kamyya Thopu , Vijayawada-520007

Please take notice that the above named Petitioner filed a MV OP for Compensation against you and the said case stands posted to 24-11-2023 for your appearance. Therefore you are hereby directed to appear before The HON'BLE XXVII ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT, SECUNDERABAD on dated: 24-11-2023 at 10.30 AM either in person or through an Advocate failing which the matter will be decided Ex party

(By the Order of the Court)

M/S .CH T V L NARASIMHA REDDY
M SATHISH KUMAR
Advocates
32-77/16, S R Nagar,S R-353, Malkajgiri,Secunderabad -5000 56
COUNSEL FOR THE PETITIONER

పదవ తరగతి సర్టిఫికేట్ పోయినవి

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం, తొర్రగుడిపాడు గ్రామ కాపురస్థులు పంది చైతన్య తండ్రి వెంకటేశ్వర్లు సంబంధించిన పదవతరగతి మార్కు ల మెమ్మె సర్టిఫికేట్ పోయినవి. SSC Education Amaravati మెమో రోల్ నెం. 1012133728. నవంబర్ 14వ తేదీన జిరాక్స్ నిమిత్తం నందిగామ గాంధీ సెంటర్ కు బైక్ పై వస్తుండగా మార్గ మధ్య లో పోయినది. సదరు సర్టిఫికేట్ దొరికిన వారు +91 93478 98089 సెల్ కు ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE: N.T.R./KRISHNA DISTRICT: AT NANDIGAMA
I.A.No. 167/2022 IN 0.S.No. 325 of 2022

Between:
Smt. Koya Bharathi ...Petitioner/Plaintiff
AND
Nuthalapati Venkata Ramana Murthy ...Respondent/Defendant

To
Nuthalapati Venkata Ramana Murthy, S/o Late Nageswara Rao, Aged about 60 years, Occ: Business, R/o H.No.3-159, Flat No.405, Golden Plaza Apartment, Nandigama Town & Mandal, NTR District

Take notice that the above-mentioned Petitioner/Plaintiff filed the above I.A. No. 167/2022 in O.S. No. 325/2022. The above case is posted to 04.12.2023 for your appearance either in person or through counsel at 10:30 AM before the Hon'ble Court, failing which the matter will be heard in your absence and decide as per law.

// By order of the court //

K.V. Rajendra Prasad,
K. Janardhan Reddy,
Advocates G2-H.No. 1-5-924, Yadav Homes, New Maruthi Nagar, Chaitanyapuri, Hyderabad 500060,
Mobile: 9392400108

NOTICE
IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE ATGUDIWADA
OS.No, 364/2015

Between:
1.Yalamanchili Usha Rani
2.Yalamanchili Vibhavendra Chowdary
(No.2 being rep. by his GPA Holder Yalamanchili Usha Rani) .... Plaintiffs.
AND
1.Yalamanchili Gopala Krishna (Died)
2.Yalamanchili Sita Ratnamani
3. Yalamanchili Satya Sree
4. Yalamchala Ramya Sree
5. Yalamanchili Swarna kumari ....Defendants.

Defendants No.6 & 7
6) Dasari Sri Devi, w/o.Vijaykanth, D/o.Late Yalamanchili Gopala Krishna, Hindu, aged about 34 yrs., 1st Lane, R/o. Kurumaddali Village, Pamarru Mandal, Krishna District, Andhra District.
7)Valluri Sri Gowri, W/o.Yugandhar, D/o. Late Yalamanchili Gopala Krishna, Hindu, aged about 32 yrs., 1st Lane, R/o. Kurumaddali Village, Pamaru Mandal, Krishna District, Andhra District.

The above suit stands posted for appearance of defendants No.s 6 & 7 and same is posted to 01-12-2023 if the defendants No. 6&7 have any objection they should appear before the above saidCourt on 01-12-2023 at 10-30 AM. either in Person or through their counsel, failing which, the Hon'ble Court willbe Passed ex-parte against them,

// BY COURT ORDER //

Viayawada,
Dt.20-11-2023

PENUMALA RAMBABU
RAVURI RAVI KUMAR,
Advocate-GUDIWADA,
D.No.23-39-47A, Laxmi Nagar, Satyanarayanapuram, Vijayawada-520 011
Cell: 92485 29999 / 94405 32654

మొదటిపేజీ తరువాయి

పసి పిల్లల ప్రాణాలతో చెలగాటం

ప్యాకెట్లపై ఉండవు. దుకాణాల్లో పెట్టేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో షేక్ రాజా ఆస్పత్రికి వస్తున్న చిన్న పిల్లల్లో ఎక్కువగా ఇలాంటి ప్యాకెట్లు తిని అనారోగ్యం పాలైన వారే ఉంటున్నారని అక్కడి వైద్యులు చెబుతున్నారు. దీనిపై తగుజాగ్రత్తలు తీసుకోవాలని, నాసిరకం చిప్స్, బిస్కెట్, చాకెట్ల విక్రయంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

వాస్తవంగా పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపించే నాసిరకం వస్తువులను విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇటీవల కాలం చెల్లిన ప్యాకెట్లను విక్రయిస్తున్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నా వారం తరువాత యథావిధిగా అవే వస్తువుల అమ్మకాలు సాగిస్తున్నారు. తనిఖీల అనంతరం మామూళ్లు పుచ్చుకుని వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజారోగ్య, ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టి నాసిరకం తినుబండారాల అమ్మకాలపై చర్యలు తీసుకుని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కుల గణనకు చట్టబద్ధత కల్పించాలి

పాఠశాలల్లోని ఉపాధ్యాయులను మినహాయించాలని, అణగారిన కులాల్లోని సంచార జీవులను గుర్తించి వారి గ్రామాలకు రప్పించి కుల గణన జరపాలని కోరారు. మాదిగ, మాల కులాలతో కలపకుండా మాస్టిన్ కులాన్ని ప్రత్యేకంగా గుర్తించాలని, మోచి కులస్తులకు వంశవక్షం తీసుకురావాలని ఒత్తిడి చేయకుండా ఎస్‌సి కులాల జాబితాలో వారిని చేర్చాలని, మత ఆధారితతో కాకుండా కుల ఆధారంతో దళిత కులాలను గుర్తించాలని సూచించారు.

సామాజిక న్యాయానికి దోహదం : కలెక్టర్ డిల్లీరావు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ సామాజిక న్యాయం, విద్య, ఆర్థికాభివద్ధికి కుల గణన చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలు సాధించేం దుకు దోహదపడు తుందన్నారు. ఈ సదస్సులో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషగిరి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఎన్‌టిఆర్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాం గదయ్య, సాంఘిక సంక్షేమ అధికారి ఎం.విజయ భారతి, డీఎల్‌డీవో కె.అనూరాధ పాల్గొన్నారు.

IN THE COURT OF THE 2nd ADDL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.P.NO.5/2022

Between:
Ch. Shanmukha Srinivas ... Petitioner
AND
1. Yalamanchili Sekhar Babu
2. Smt. Anumolu Sree Devi ... Respondents

Respondent No.1:
Yalamanchili Sekhar Babu, S/o. Bhaskara Rao, Hindu, Aged about 50 years, Business, R/o. D.No.5-44/3, 2nd Floor, Opp. Rajkamal Model Residency, Back side of Narayana School, Kanuru Village, Vijayawada-520007

పై నెంబరు పిటీషన్‌ను పిటీషనరు రెస్పాండెంట్సు పై సేల్‌డీడ్ తేది.06-02-2021 రద్దు చేయమని పిటీషనర్ ఐ.పి. పిటీషన్‌ను దాఖలు చేసి యున్నారు. రెస్పాండెంట్ నెం.1 ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేసినందున రెస్పాండెంట్ నెం.1 కోర్టుకు హాజరగు నిమిత్తం ది.29-11-2023 వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం. 10.30ని.లకు రెస్పాండెంట్ నెం.1 స్వయంగా గానీ, అడ్వకేటు గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకొనవలెను. లేనియెడల ఐ.పి. పిటీషన్‌ను మీ పై కోర్టు వారిచే పరోక్షమున తీర్మానించబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ///

వాయిదా తేది: 29-11-2023

నిమ్మగడ్డ దుర్గాప్రసాద్, యస్. లక్ష్మీకాంత్
పిటీషనరు తరపు న్యాయవాదులు
సూర్యారావుపేట, విజయవాడ-2

మహారాజశ్రీ నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
FDP/IA No. 128/2018 in O. S. No.60/2008

Between:-
గంగా అరుణ కుమారి ...పిటిషనర్
మరియు
పాపోలు అప్పయ్య వగైరాలు ... ప్రతివాదులు

To
8వ ప్రతివాది: దూపగుంట అన్నపూర్ణమ్మ భర్త వెంకటేశ్వర్లు, R/o చందర్లపాడు గ్రామం, మండలం. కృష్ణా జిల్లా.

పై నంబరు పైనల్ డిక్రీ పిటీషన్ లో శ్రీ కోర్టు వారు రిజిష్టర్ పోస్ట్ ద్వారా అనేక పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు నోటీసు అందు కొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఆర్డరు చేసి, ది. 27-12-2023 వ తేదీన వాయిదా ఇచ్చినందున, ఆ తేదీన మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా ఉదయం గం. 10.30.ని.లకు హాజరై, మీ ఆక్షేపణలు ఏమయినా ఉన్నయెడల సమాధానం వేసుకొనగలరు, లేని మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానము చేయుదరని తెలియజేయటమైనది.

వాయిదా తేది :27-12-2023

// By Court Order//

కొనకంచి శ్రీనివాసరావు,
పిటిషనర్ తరపు న్యాయవాది, నందిగామ.

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రజల నుండి అందే అర్జీల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పెద్ది రోజా, మచిలీపట్నం ఆర్డిఓ ఎం వాణిలతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎంతో శ్రమకోర్చి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని స్పందన అర్జీలను సానుకూలంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సౌదారాణి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

కంకిపాడు ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్ సెంటర్లో విధి నిర్వహణలో ఉండగా చనిపోయిన అంగన్వాడి టీచర్ ముళ్లపూడి సౌదారాణి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సౌదారాణి కుటుంబానికి రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వినతి ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి, పి.రజీనా రాణి, సిహెచ్, నాంచారమ్మ, సుజాత, సిఐటియు కార్యదర్శి సిహెచ్ జయరావు లు ఉన్నారు.


క్రీడాకారులను సత్కరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

క్రీడాకారులకు సన్మానం

సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన మీటింగ్ హాల్లో నాగాయలంకకు చెందిన ఇరువురు క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. నాగాయలంకకు చెందిన నాగిడి సాంబశివరావు కుమార్తెలు గాయత్రి, భార్గవి కియాకింగ్, కెనోయింగ్ క్రీడా పోటీల్లో జాతీయస్థాయిలో పతకాలు పొందారు. ఈ ఏడాది అక్టోబర్ 17, 18 తేదీలలో మధ్యప్రదేశ్ లో జరిగిన కియాకింగ్ పోటీలలో నాగిడి గాయత్రి రెండవ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించింది. భార్గవి కెనోయింగ్‌లో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. 37వ జాతీయ క్రీడల్లో గాయత్రి రెండో స్థానం, భార్గవి నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని అభినందిస్తూ రానున్న క్రీడా పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పెద్ది రోజా, ఆర్డీవో ఎం.వాణి పాల్గొన్నారు.



అగ్నిప్రమాదంలో ఆటోమొబైల్ షాపు దగ్ధం

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం లో సినిమా థియేటర్స్ సెంటర్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ లలో ప్రమాదవశాత్తు ఆటోమొబైల్ షాపులో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లక్షల్లో ఆస్తి నష్టం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీ శ్రీనివాస ఆటోమొబైల్ షాపు యజమాని మడతల గురువారెడ్డి షాపు నిర్వహిస్తున్నాడు. షాపులో పూర్తిగా ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ సామాన్లు కాలిపోయాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. రాత్రి కావడంతో మూసివేసిన ఆటోమొబైల్ షాప్ లో ఒక్కసారిగా మంటలు చెలరాగడంతో రహదారిపై వెళ్లేవారు ఆందోళనకు గురయ్యారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. గన్నవరం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి-కంకిపాడు: మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదేశానుసారం తుమ్మలపల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో కంకిపాడు బూత్ నెంబర్ 183లో ఓటర్ జాబితాను సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ పులి శ్రీనివాసరావు, బూత్ ఇన్చార్జ్ సాంబశివరాజు, సీనియర్ నాయకులు కొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయాలని వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో దెబ్బతిన్న రహదారులను నిర్మించి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చాలని కోరుతూ జనసేన, టిడిపి నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం రాజు, గళ్ల తిమోతి, వంపు గడవలచౌదరి, కాంతారావు, పినిశెట్టి నాగఛాయాదేవి, లంకిశెట్టి నీరజ, గోపు సత్యనారాయణ, లంకె నారాయణ ప్రసాద్, పంచ పరవాలకాశీ విశ్వనాథ్, కర్రీ మహేష్, శాయనశివ, పుప్పాల ప్రసాద్, సుశీల, గంపల భవాని, ఈవనమణి బాబు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి-గన్నవరం: అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా గన్నవరం మండల లీగల్ సర్వీస్ అథారిటీ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం దావాజీ గూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తిరీవీధి వెంకయ్య అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో 12వ అదనపు మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి. శిరీష మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల ప్రకారం నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అనుమోలు వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాస్తి తాతారావు, సీనియర్ న్యాయవాదులు బివి. స్వామి, ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి పున్నమిదేవి పాల్గొన్నారు.

విన్నకోట రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని చింతలగుంట నుండి విన్నకోట వెళ్లే కాల్వగట్టు రహదారి గుంతలతో అధ్వనం మారడంతో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురిటిపాడు, కట్టావానిచెరువు, తాడిచర్ల, చింతలగుంట గ్రామాల నుంచి విన్నకోట హై స్కూల్ కి వెళ్లే విద్యార్థులు, గ్రామస్తులు నిత్యం ఇబ్బందులు పడటమే కాక వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని చింతలగుంట గ్రామ టీడీపీ నాయకులు ఈడే మోహన్ గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి రావి వెంకటేశ్వరావుకు వివరించడంతో ఆయన వెంటనే స్పందించి ప్రొక్లెయిన్ ఏర్పాటు చేశారు. రోడ్డును సరిచేసే కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు అడుసుమిల్లి రామ్మోహన్, బెజవాడ వెంకయ్య, అబ్దుల్ కరీమ్, ఈడే నాగార్జున, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, వేముల కొండ తదితరులు పాల్గొన్నారు.

'అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలి'

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు మండల పరిధిలోని రామకష్ణాపురం గ్రామంలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న సచివాలయ, ఆర్‌బికె భవనాలను వెంటనే పూర్తిచేయాలని కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు కోరారు. సోమవారం కోడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. భవన నిర్మాణాలు పూర్తి కాకుండానే బిల్లు చేసుకున్నారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: కవుతరం, శేరిదగ్గుమిల్లి రెవిన్యూ గ్రామ పరిధిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సోమవారం కవుతరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘములో ప్రారంభించినట్లు సహకార బ్యాంక్ ఛైర్మన్ వడ్లమూడి నాగమోహన్ (చిన్ని) తెలిపారు. సాధారణ రకము ధాన్యమునకు 75 కిలోల బస్తాకు రూ.1637, గ్రేడ్ ఏ రకము 75 కిలోల బస్తాకు రూ.1652 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మొత్తం 15,500 గోనె సంచులు సిద్ధంగా ఉన్నట్లు ఛైర్ పర్సన్ వడ్లమూడి (చిన్ని) వివరించారు.

రైతులకు సకాలంలో రుణాలందించేందుకు చర్యలు

కెడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ పద్మావతి

ప్రజాశక్తి-కోడూరు: రైతులకు సకాలంలో రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, సహకార బ్యాంకులలో సేవింగ్స్ ఖాతా లేనివారికి సేవింగ్ ఖాతాలు ప్రారంభించి డిపాజిట్లు సేకరించాలని కృష్ణాజిల్లా సహకారం కేంద్ర బ్యాంక్ ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద సహకార పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. తొలుత గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఉల్లిపాలెం గ్రామ ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. సభా కార్యక్రమానికి సంఘం ఈవో మత్తి అర్జున్‌రావు అధ్యక్షత వహించగా ఉల్లిపాలెం పిఎసిఎస్ ఛైర్మన్ కటకం కుటుంబరావు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా 13 కోట్ల రూపాయలు రుణాలు అందించామని, 16 కోట్ల రూపాయలు టర్నోవర్ జరుగుతుందని అన్నారు. త్వరలో తమ సంఘం ద్వారా జనరిక్ మందుల షాపు, పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్నామని అన్నారు. పద్మావతి మాట్లాడుతూ కెడిసిసి బ్యాంకు 10,500 కోట్లకు పైగా టర్నోవర్ సాధించి దేశంలో ఐదో స్థానంలో ఉందన్నారు. సహకార బ్యాంకులో అందించే సేవలను ప్రజలకు తెలియజేసి వాణిజ్య బ్యాంకులకు ధీటుగా పని



చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల కొత్త ఖాతాలు ప్రారంభించాలని, సహకార బ్యాంకుల ద్వారా ఏటీఎం, ఫోన్ పే సౌకర్యం కూడా ఉందన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి కె భోజరంగరాజు మాట్లాడుతూ సహకార వారోత్సవాలు ప్రాముఖ్యతను, సహకార పతాకంలోని రంగుల విశిష్టతను గురించి యూనియన్ పాత్రను గురించి వివరించి యూనియన్ సేవలు అన్ని సంఘాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సబ్ డివిజన్ సహకార అధికారి డి నాగమల్లేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ ఛైర్ పర్సన్ సిహెచ్ సురేంద్రనాథ్ బెనర్జీ, లింగారెడ్డి పాలెం పిఎసిఎస్ ఛైర్ పర్సన్ చిట్టిప్రోలు బ్రహ్మా రావు, ఉల్లిపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ వెర్రి పావని, కేడీసీసీ బ్యాంక్ కోడూరు బ్రాంచ్ మేనేజర్ కే సుధాకర్, సూపర్వైజర్ టి.వంశీకృష్ణ పాల్గొన్నారు.



జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి సిటీకేబుల్‌లో జర్నలిస్ట్ గా పనిచేస్తూ ఇటీవల మరణించిన కల్లేపల్లి చంద్ర కుటుంబానికి పెనమలూరు నియోజకవర్గ పాత్రికేయుల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం చంద్ర నివాసం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాత్రికేయులు అందించిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని చల్లపల్లి సిఐ నాగ వరప్రసాద్ ద్వారా కుటుంబ సభ్యులకు అందించారు. **అవనిగడ్డ:** చంద్ర ఇటీవల ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ దివిసీమ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు అవనిగడ్డ ప్రెస్‌క్లబ్‌కు పలువురు దాతల ద్వారా రూ.53 వేలు విరాళాలు సేకరించారు. ఈ విరాళాన్ని అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అప్పికట్ల శ్రీనివాసరావు, పుట్టి శ్రీనివాసరావు ద్వారా కుటుంబ సభ్యులకు అందించారు.

వైసిపి మహిళా అధ్యక్షురాలిగా సుజాత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: వైసిపి మండల తొలి మహిళా అధ్యక్షురాలిగా పడమట సుజాతను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి దుక్కిపాటి శశిభూషణ్ తెలిపారు. కవుతరం సర్పంచ్‌గా సుజాత అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారని పేర్కొన్నారు. రెండు దఫాలుగా కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్‌గా పనిచేసి జిల్లాలోని రైతులకు అనేక సహాయ సహకారాలను అందించారని తెలిపారు. సుజాత మాట్లాడుతూ ఎమ్మెల్యే కొడాలి నాని సహకారంతో అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

జనసేనను వీడేది లేదు : శేషుబాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ: జనసేన పార్టీని వీడేది లేదని మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వం, పార్టీ సిద్ధాంతాలు నచ్చి ప్రభుత్వ ఉద్యోగాన్ని వీడి పార్టీలో చేరడం జరిగిందన్నారు. తన ప్రాణం పోయేవరకు పవన్ కళ్యాణ్‌ని, జనసేన పార్టీని వీడబోనని స్పష్టం చేశారు. ఇటీవల జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల



మనోహర్ మంగళగిరి పార్టీ కార్యాలయంలో తనను మందలించినట్లు దానికి మనస్థాపనతో పార్టీకి రాజీనామా చేసి వేరే పార్టీలో చేరుతున్నట్లు కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం ముందు టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే జనసేన వీర మహిళలపై దాడికి పాల్పడ్డారని, దానికి నిరసనగా రెండో రోజు బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ క్రమంలో అందరినీ కలుపుకొని వెళ్లాలని మాత్రమే నాదెండ్ల మనోహర్ తనకు సూచించారని తెలిపారు. రానున్న ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గంలో టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీల అభ్యర్థిని గెలిపించి పవన్ కళ్యాణ్ కు గిఫ్టుగా ఇస్తామని శేషుబాబు తెలిపారు.

విద్యార్థినులకు ఉద్యోగ శిక్షణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం లోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మొదటి, రెండవ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థినులకు ఉద్యోగ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమయ్యింది. ఎకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విభాగం విద్యార్థులకు కష్ణా జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్, మరియు వాణిజ్య శాఖ కార్యాలయంలో, ఆఫీస్ అసిస్టెంట్ షిప్ విద్యార్థులకు మండల అభివద్ధి శాఖ అధికారి కార్యాలయంలో, కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులకు జిల్లా పరిషత్ మరియు బీసీ కార్పొరేషన్ నందు పారామెడికల్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అయినంపూడి ఆనంద్ కుమార్ తెలిపారు. మొదటిరోజు కృష్ణాజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ సీఈవో శ్యాం మనోహర్, జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లంకి శెట్టి హరిబాబు మున్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఆచార్య సూర్యచంద్రరావు

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు గ్రంథాలయాలను పూర్తి స్థాయిలో వినియోగించుకున్నప్పుడే మంచి విజ్ఞానవంతులవు తారని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య డీ. సూర్యచంద్ర రావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 56వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉత్సవం ఆ కళాశాల గ్రంథాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య సూర్యచంద్ర రావు మాట్లాడుతూ గ్రంథాలయాల విజ్ఞాన బండగారాల న్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.నారాయణరావు మాట్లాడారు. కళాశాలలోని గ్రంథాలయం సుమారు 90 వేల పుస్తకాలతో విద్యార్థుల వికాసానికి అండగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ విభాగాధిపతి శ్రీనివాసురాజు, పాల్గొన్నారు.

22 నుండి ఆలిండియా పోస్టల్ టిటి పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎపి పోస్టల్ సర్కిల్ విజయవాడ రీజియన్ నిర్వహణలో ఈనెల 22 నుండి 26వ తేద వరకు పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 39వ ఆలిండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు విజయవాడ రీజియన్ పోస్టు మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్.మూర్తి, ఎపి సిర్కల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సందేశ్ మహదేవప్ప తెలిపారు. నగరంలోని పోస్టల్ శాఖ కార్యాలయంలో టోర్నమెంట్‌కు సంబంధించిన లోగోను సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు, ఆటలు జీవితంలో అంతర్భాగాలని, క్రీడలు, ఆటలు ఉద్యోగులను ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండేలా చేస్తాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో పురుషులు, మహిళలు సింగిల్స్, డబుల్స్, వెటరన్ విభాగాల్లో జరుగుతాయన్నారు. అస్సాం, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుండి దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీలు ఈనెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోస్టర్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్రంలో మహిళా సాధికారత, సమగ్రాభివద్ధికి సిఎం జగన్ పెద్దపీట వేశారని రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని చిల్లకల్లు ఎండిఒ కార్యాలయంలో మండల సమైక్య సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదేనని అన్నారు. ప్రతి అడుగులోనూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల సమైక్య ప్రతినిధులు, వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సామినేని

క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నీ

ఇండియా - ఎ, ఇంగ్లాండ్ జట్ల విజయం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : బీసీసీఐ (భారత క్రికెట్‌నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) పర్యవేణ్‌లో జరుగుతున్న క్వాడ్రాంగ్యులర్ వన్డే క్రికెట్ టోర్నీలో సోమవారం జరిగిన బ్యాచ్‌లో ఇండియా - ఎ జట్టు, ఇంగ్లాండ్ జట్లు విజయం సాధించాయి. మూలపాడులోని డివిఆర్ గ్రౌండ్‌లో ఇండియా - బి, ఇంగ్లాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈమ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు మూడు వికెట్ల ఆధిక్యతతో విజయం సాధించింది. ఈమ్యాచ్‌లో ఇండియా - బి జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. దీనితో తొలుత బ్యాటింగ్ చేసి ఇండియా - బి జట్టు 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ సచిన్ దాస్ 78 బంతుల్లో 107 పరుగులు చేయగా మరో బ్యాట్స్‌మెన్ రుద్ర మయూర్ 81 బంతుల్లో 82 పరుగులుచేశారు. అనంతరం ఇంగ్లాండ్ బౌలర్ తైన్‌ఖ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 320 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ జట్టు 49.2 ఓవర్లలో 320 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ తియో వైలీ 118 పరుగులు, హంజా షేక్ 64, తైయిన్ 51 పరుగులు చేశారు. ఇండియా బి జట్టు బౌలర్లు కార్తిక్ మూడు, విఘ్నేష్ రెండు వికెట్లు



తీసుకున్నారు.

92 పరుగులతో ఇండియా ఎ జట్టు విజయం...

మరో మ్యాచ్ బంగ్లాదేశ్, ఇండియా - ఎ జట్ల మధ్య జరిగింది. ఈమ్యాచ్‌లో 92 పరుగుల ఆధిక్యతతో ఇండియా ఎ జట్టు ఘన విజయం సాధించింది. ఈమ్యాయచ్‌లో ఇండియా - ఎ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా ఎ జట్టు 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. అనంతరం 318 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు 47.2 ఓవర్లలో 225 పరుగులకే అంతా అవుటయ్యారు.



టిటి పోటీలకు కృష్ణాజిల్లా విద్యార్థి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈనెల 21 నుండి 24వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగనున్న సిబిఎస్‌సి నేషనల్ లెవల్ టేబుల్ టెన్నిస్ పోటీలకు కృష్ణాజిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ క్రీడాకారిణి ఎంపికయ్యారని కృష్ణాజిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ కె.బలరాం తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన క్రీడాకారిణి చార్వి ని నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్/స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. అండర్ -14 విభాగంలో ఆకృతి మిత్తైలా చార్వి ఎంపికైందని తెలిపారు.

ఆకట్టుకుంటున్న తికమకతండా ట్రైలర్: విష్ణు, వెలంపల్లి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యువ హీరోలు తిరుపతి రామకృష్ణ, హరికృష్ణలు నటించిన తిక మక తండా సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోనుందని ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు అన్నారు. కోడూరుకు చెందిన టిఎస్ఆర్ మూవీ మేకర్స్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు కుమారులు రామకృష్ణ, హరికృష్ణ జంటగా నటించిన తిక మక తండకు సంబంధించిన ట్రైలర్‌ను ఎమ్మెల్యేలు నగరంలో ఓ కార్యక్రమంలో తిలకించారు. కార్యక్రమంలో పాల్గొన్న చిత్ర యూనిట్ సినిమాకు సంబంధించిన విశేషాలను నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ సందర్భంగా తికమక తాండ సినిమా ట్రైలర్ను విజయవాడ పశ్చిమ సెంట్రల్ ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు మల్లాది విష్ణువులు రిలీజ్ చేశారు. తికమాక తండా సినిమాలోని ఓ పుత్తడి బొమ్మ అనే పాటను రిలీజ్ చేయగా, ఈ సందర్భంగా వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణులు ట్రైలర్ చాలా బాగుందని పుత్తడిబొమ్మ సాంగ్ చాలా అద్భుతంగా వచ్చిందని సినిమా యూనిట్‌ను అభినందించారు. తికమక తాండ సినిమా నిర్మాత టీఎస్ఆర్ మూవీ మేకర్స్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ డిసెంబర్ 15వ తేదీన ఈ సినిమాను వెండితెరపై రిలీజ్ చేస్తున్నట్లు, సినిమా అద్భుతంగా వచ్చిందని, ప్రేక్షకులు అందరినీ కూడా ఆకట్టు కుంటుందని, నూతనం గా వస్తున్న యువ హీరోలను ఆశీర్వదించాల్సినదిగా తిరుపతి శ్రీనివాసరావు కోరారు.


వెలంపల్లిని, విష్ణుని సన్మానించిన చిత్ర బృందం


మాట్లాడుతున్న తిరుపతిరావు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ

ఎంపి నందిగం సురేష్ హామీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ముందుందని, భరోసా కల్పిస్తూ పేద వర్గాల సంక్షేమ కోసం నిరంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్ అన్నారు. నగరంలోని కె.ఎల్.రావు భవన్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రెండో వార్షికోత్సవ సమావేశం సోమవారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు అభివద్ధి వర్ణణాతీతం అని, ఉద్యోగుల సమస్యలు ఏమైనా ఉంటే వాటి పరిష్కారానికి కషి చేస్తానని నందిగం సురేష్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనేక క్యాడర్ ఉద్యోగులకు భరోసా కల్పించిన ప్రభుత్వమని కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులేషన్, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, గ్రామ సచివాలయం వ్యవస్థ ఏర్పాటు, వైద్య ఆరోగ్యశాఖ కమిషనరేట్ ఉద్యోగులకు జీరో వన్ జీరో కింద పద్దులో జీతాలు, ఈ నెలలో ఉద్యోగులకు రావాల్సిన డి ఏ మంజూరు చేసిందన్నారు. అమలాపురం శాసనమండలి సభ్యులు ఇజ్రాయిల్ ప్రభుత్వ ఉద్యోగులు సర్వీసు సంక్షేమ సలహాదారులు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, మానవ హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ రావు గోచిపాత మాట్లాడుతూ పేద ప్రజల హక్కులకు మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా కాపాడడానికి కషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లిడ్‌క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ, మేడిపల్లి ఝాన్సీ రాణి, సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ జి.భానుమూర్తి, 400 మంది పలు జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నందిగం సురేష్, తదితరులు

విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : చెస్ ఆడటం వలన విజ్ఞానంతో పాటు వికాసం పెరుగుతుందని, అంతకంటే ముఖ్యంగా విద్యార్థులు ఏదో ఒక ఆటలో నైపున్యాన్ని పెంపొందించు కోవాలని జాయింట్ ఇన్‌కమ్ టాక్స్ కమీషనర్ వి.కోటేశ్వరమ్మ అన్నారు. కానూరు వద్ద గల స్కాట్ స్పైన్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ సోమవారం జరిగింది. రికార్డు స్థాయిలో 450 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కొటేశ్వరమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై కూడా ప్రావీణ్యత పెంపొందించు కోవాలన్నారు. ఆటలు మంచి క్రమశిక్షణను నేర్పుతాయమని అన్నారు. స్కాట్ స్పైన్ స్కూల్ సీఈవో కె.జాహ్నవి, ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమి ప్రెసిడెంట్ జె.శైలజ మాట్లాడుతూ చెస్ ఆటలో విజయవాడకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో మంది చెస్‌లో రాణించారని తెలిపారు. కోనేరు హంపి, ఎంఆర్. లలిత్‌బాబు వంటి వారు గ్రాండ్ మాస్టర్, సూపర్ గ్రాండ్ మాస్టర్లుగా ఎదిగారని తెలిపారు. తమ అకాడమి ద్వారా నిపుణులైన కోచ్‌ల పర్యవేక్షణలో చెస్‌లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. స్కూల్ డైరెక్టర్ వి.శాంతి మాట్లాడుతూ జనవరిలో క్లాసికల్ ఇంటర్నేషనల్ రేటింగ్ టోర్నమెంట్ తమ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా విజేతలైన 120 మందికి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెలగాజోషి,చ మెప్మా మిషన్ మేనేజర్ ఎన్.ఎస్.ఆర్. శ్రీనివాస్, ఆంధ్రచెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అమ్మినేని ఉదయ్‌కుమార్, స్కాట్ స్పైన్ స్కూల్ డైరెక్టర్ వి.శాంతి, ప్రముఖ చెస్ కోచ్ ఎస్.కె.ఖాసిం, రవీంద్రబారతి స్కూల్‌డైరెక్టర్ శాంతి, పాల్గొన్నారు. కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటనీ ఎన్.ఎం.ఫణికుమార్ నిర్వహణలో పోటీలు విజయవంతంగా నిర్వహించడం పట్ల సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.


చెస్ క్రీడాకారులతో జాయింట్ ఇన్‌కమ్ టాక్స్ కమీషనర్ వి.కోటేశ్వరమ్మ, కోచ్‌లు

